తెరవెనుక న్యూస్!

సుజనశ్రీ

నారాయణరావు సైన్యంలో హావల్దార్ గా పనిచేసి, పదేళ్ల సర్వీసు పూర్తయింది. ఆర్మీలోంచి రిటైరై తన స్వగ్రామం హైదరాబాదు చేరుకున్నాడు. అతడికి వెనుకా ముందూ ఎవరూ లేరు. ఏకో నారాయణ!

మిలటరీవాళ్లు మంజూరుచేసిన గ్రాట్యూటీ బ్యాంక్ లో వేసుకున్నాడు. ఇకపైన ఏ ఉద్యోగం చేయాలా అనే ఆలోచనలో పడ్డాడు. ఒకరి క్రింద పనిచేయకుండా స్వతంత్రంగా జీవిస్తూండే వ్యాపకం కావాలి. నిత్యనూతనంగానూ, సాహసవంతమైనదిగానూ ఉండాలి. నెలరోజుల పాటు ఆలోచించి ప్రయివేట్ డిటెక్టివ్ గా తన పేరు నమోదు చేయించుకున్నాడు.

హైదరాబాదునుంచి వెలువడే పత్రిక లన్నిటిలోనూ ఆ ప్రకటన వేయించాడు.

దినపత్రికలో అచ్చయిన తన అడ్వర్టయిజుమెంట్ చూసుకుని ఆలోచిస్తున్నాడు నారాయణరావు.

బాయ్ వచ్చి "సార్! మీకు ఫోన్ వచ్చింది సార్!" అన్నాడు.

నారాయణరావు గర్వంగా మీసాల్ని సవరించుకున్నాడు. తన ఆఫీస్ కి టెలిఫోన్ లేదు. కానీ తన ఆఫీసున్న ఇంటి ప్రక్కనే సబ్ పోస్టాఫీసుంది. అందులో పబ్లిక్ టెలిఫోన్ ఉంది. ఆ పోస్టాఫీసులో పనిచేసే సబ్ పోస్టుమాష్టరు నారాయణరావుకి మంచి స్నేహితుడు.

అందుకే ధైర్యంగా తన ప్రకటనలో ఆఫీసు అడ్రసు ఇస్తూనే, "లేదా ... నెంబర్ కి ఫోన్ చేయండి!" అంటూ పోస్టాఫీసు నెంబరు ఇచ్చాడు.

ఫోన్ లో మాట్లాడి వచ్చాడు నారాయణరావు. అతడి ఛాతీ ఇంకా రెండంగుళాలు ఉబికింది. తన ప్రకటన పడీ పడంగానే, అప్పుడే మొదటికేసు తగిలింది.

ఆ ఫోన్ చేసింది ఎవరో కాదు. ప్రఖ్యాత దర్శక నిర్మాత చంద్రశేఖర్! వెంటనే తన ఆఫీసుకు రావలసిన దిగా కోరాడు ఫోన్ లో.

స్కూటర్ ని స్టార్ట్ చేసి, బయలుదేరాడు నారాయణరావు.

ఈ మధ్యనే హైదరాబాదులో సినీ సంచలనం ప్రారంభమయింది. నటసామ్రాట్ స్టుడియో ప్రారంభం కావటం, నటరత్న స్టుడియో నిర్మాణంలో ఉండటంతో తెలుగు చలనచిత్ర పరిశ్రమ అంతా రెక్కలు గట్టుకుని

మద్రాసునుంచి హైదరాబాద్‌కి యెగిరివచ్చిందా అన్న ట్టుగా ఉంది.

వెండితెరపై వెలిగే తారల గురించీ, కొత్తచిత్రాల నిర్మాణం గురించీ పబ్లిసిటీ ఇచ్చేందుకు సినిమా పత్రికలు అనేకం ఉన్నయ్. కొన్ని కొత్తవి ఇంకా వస్తున్నయ్. అయితే ప్రపంచంలో ఉన్నవారంతా మంచివారే అయితే ఇంక కథేముంది? పదిమందిలో ఒక్కడైనా చెడ్డవాడు ఉంటాడు. మానవస్వభావమే అంత!

ఒకటీ అరా పత్రికలు ఈ సినీజీవుల తెరమరుగు జీవితాలనూ, వారి అసభ్య నడవడికల్నీ ప్రచురించి డబ్బు చేసుకుంటుంటయ్. అలాంటిదే హైదరాబాదునుంచి వెలువడే "తెరవెనుక న్యూస్" పక్ష పత్రిక. నారాయణ రావుకి ఆ పత్రిక అంటే పరమ అసహ్యం. లక్షణంగా ఎవరి బ్రతుకు వాళ్ళు బ్రతుకుతుంటే, వారి బ్రతుకుల్ని బజారుకీడ్చి రచ్చచేయటం ఎందుకా అని అతడి అభిప్రాయం.

స్కూటర్ చంద్రశేఖరం బంగళాముం దాగింది. స్కూటర్‌కి స్టాండ్ వేసి లాక్ చేసి లోపలకు నడిచాడు.

డ్రాయింగ్ రూమ్‌లో చలనచిత్ర దర్శకనిర్మాత చంద్రశేఖరం సోఫాలో కూర్చుని ఉన్నాడు. అతడి చేతిలో నారాయణరావు ద్వేషించే "తెరవెనుక న్యూస్" పక్ష పత్రిక ఉంది.

"నమస్కారమండీ! నా పేరే నారాయణరావ్! ప్రయివేట్ డిటెక్టివ్‌ని" తనను తాను పరిచయం చేసుకున్నాడు.

"అలా కూర్చోండి!" అంటూ బాయ్‌ని పిలిపించి బిస్కట్లూ, డ్రింక్స్ తెప్పించాడు చంద్రశేఖరం.

డ్రాయింగ్ రూమ్ చాలా పెద్దది. గోడలమీద నాలుగు

వేపులా చలనచిత్ర రంగంలోని వర్ధమాన నాయికా నాయకుల నిలువెత్తు ఫోటోలు, చంద్రశేఖరం డైరక్టు చేసిన చిత్రాల్లోని స్టిల్స్ తాలూకు ఫోటోలు ఉన్నయ్.

చంద్రశేఖరం దాదాపు ఆరడుగుల ఎత్తున్నాడు. పసిమిఛాయతో దృఢంగా ఉన్నాడు. కళ్ళకు రిమ్‌లెస్ గ్లాసెస్, సిల్కు లాల్చీ, ధోవతీ, మెళ్ళో బంగారు ఛెయిన్, చేతికి వజ్రాలు పొదిగిన రస్టువాచ్‌తో మనిషి చాలా హుందాగా, గంభీరంగా ఉన్నాడు.

"మీకు ఒక విషయాన్ని అప్పగిద్దామని పిలిచాను. అసలు, ముందు పోలీసులకు తెలియజేస్తే బాగుంటుం దను కున్నాను. తీరా బాగా ఆలోచించినమీదట ఇది పోలీసులకు సంబంధించింది కాదనిపించింది. పైగా ఈ విషయం బయటకు పొక్కి రచ్చ అవుతుంది. మా పరువూ, ప్రతిష్ఠలు మంట గలుస్తాయ్. అందుకే మిమ్మల్ని రప్పించాను."

"వివరాలు చెప్పండి" అన్నాడు నారాయణరావు.

"అదే! వస్తున్నా! మన హైదరాబాదునుంచి వెలువడే పత్రపత్రిక "తెరవెనుక న్యూస్"ను చూసే ఉంటారు మీరు. సినీతారల పడకటింటి రహస్యాల్ని, బాత్ రూమ్ కబుర్లనూ ప్రచురించి, యువపాఠకుల్ని వెర్రెత్తించే పత్రిక అది. ఛీ! ఛీ! ఇలాంటి పత్రికల్ని యెందుకు బ్యాన్ చెయ్యరో!" చంద్రశేఖరం తన సోఫాప్రక్కనే పడి ఉన్న పత్రికవంక ద్వేషంగా చూశాడు.

"అవును! ఆ పేరు విన్నాను. ఆ పత్రిక అంటే నాకూ గిట్టదు."

"ఆ పత్రికవాడు నేను తీస్తున్న చిత్రంలోని హీరోయిన్నూ, తద్వారా నన్నూ బ్లాక్ మెయిల్ చెయ్యాలని చూస్తున్నాడు!"

"ఏ విధంగా?"

"మా చిత్రంలోని హీరోయిన్ అందాల తార 'మాలిని' గురించి ఏదో అసభ్యపు వ్రాతలు వ్రాయబోతున్నాడట. అది ప్రచురణ జరిగితే మాలిని పరువేం కాను? ఆమెకు చెడ్డపేరు వస్తే, మా చిత్రం దెబ్బ తింటుంది. కనుక మీ రెలాగయినా ఆ వ్యాసం అచ్చుకాకుండా చూడాలి. దాని వ్రాతప్రతులన్నిటినీ తీసుకొచ్చి నాచేతి కివ్వాలి!"

వర్థమాన నటీమణి మాలిని ఎంతో డిమాండ్‌లో ఉన్న తార. ఆమె మాంఛి అందగత్తె కూడా. వేలాది ప్రేక్షక యువకుల హృదయాల్లో ఆరాధ్యదైవమయిన యువతి మాలిని. మరి ఆమెను గురించిన అసభ్యశృంగారసాహిత్యం బజారులో పెడితే యువకులకు గంగవెర్రులెత్తి ఆ పత్రికను ఎగరేసుకు పోతారంటే సందేహంలేదు.

"పెద్ద పెద్ద పదవుల్లో ఉన్నతహోదాల్లో ఉన్నవాళ్ళకు కూడా ఏదో ఒక చిన్న బలహీనత ఉంటుంది." డిటెక్టివ్ నారాయణరావు సానుభూతి వ్యక్తం చేసాడు. "పోనీ ఆ పత్రిక ఎడిటర్‌నే అడగలేకపోయారా? ఆ వ్యాసం ప్రచురింపబడకుండా ఆపేవాదేమో?"

"అదీ అయింది! అతడికి లక్షరూపాయలిస్తే, మాతో సహకరిస్తానన్నాడు. చూస్తూ చూస్తూ అంత డబ్బు ఎక్కడ్నుంచి తేగలం? నిజానికి చేతిలో ఆ లక్షే ఉంటే మా చిత్రం పూర్తయి ఈపాటికి కలెక్షన్లు వసూలు చేస్తుండేది!"

"అయితే నన్నిప్పుడేం చేయమంటారో చెప్పండి!"

"మీరా పత్రిక ఎడిటర్ని కలుసుకోండి! ఎలాగైనా మిలిట్రీ మనుష్యులు గదా మీరు? మీకు ధైర్యం పాలు ఎక్కువ! వాడికి కొంచెం బెదురుపెట్టండి ఆ సమాచారం ప్రచురించకుండా!"

"అంటే తుపాకీ తీసుకెళ్ళి కాల్చమంటారా? యుద్ధంలో బద్ధ శత్రువుని కాల్చినట్లు! కానీ ఇది సివిల్ వ్యవహారం! యుద్ధభూమి కాదు. అదీగాక నా దగ్గర తుపాకీ కాదుగదా, రివాల్వర్ గూడా లేదు! అది సరే. యీ కేసు తీసుకుంటే నా ఫీజు ఏమిస్తారు?"

"ఎంతయినా సరే! ఆ వ్యాసం తాలూకు వ్రాతప్రతి ఒరిజినల్ దాని నకళ్లైనా ఉంటే అవి వీలైతే ఆ ఫైల్ అంతా తీసుకురావాలి! అంతేకాదు, ఆ వ్యాసాన్ని నీవు కూడా చదవకూడదు" చంద్రశేఖరం అనూయ చూస్తూంటే నారాయణరావుకు నవ్వు వచ్చింది.

"అసలు కొద్దిగానైనా చదవకపోతే, ఆ ఫైల్ మాలి నికి సంబంధించినది అవునో కాదో ఎలా తెలుసుంది? అందుకని మొదలు కొంచెంగా చదివి, ఆ ఫైల్ మాలినికి సంబంధించినదే అని రూఢిపరుచుకున్నాక దాన్ని తెచ్చి మీకిస్తాను. ఇంతకీ ఫీజు విషయం ఒక అగ్రిమెంటుకువస్తే మంచిదనుకుంటాను."

"నీ ఫీజు క్రింద అయిదువేలు ఇస్తాను. అగ్రిమెంటూ ఇలాంటివేం వ్రాయను. కావాలంటే అంతా అడ్వాన్సు గానే ఇస్తాను సరా!" అంటూ చంద్రశేఖరం సోఫా లోంచి లేచి లోపలకు వెళ్ళాడు.

నోట్లకట్టలు తెచ్చి నారాయణరావు ముందు పడేశాడు చంద్రశేఖరం.

"విష్ యూ బెస్ట్ ఆఫ్ లక్!" అన్నాడు చంద్ర శేఖరం, అతడ్ని బయటిదాకా సాగనంపుతూ.

"ఇదే నా మొదటికేసు. ఇది విజయవంతమయేలా చూడటంపైనే నా భవితవ్యం ఆధారపడి ఉంది!" అంటూ అక్కడ్నుంచి కదిలాడు నారాయణరావు.

2

డిటెక్టివ్ నారాయణరావు తన రూమ్‌కి తిరిగివచ్చాడు, జేబులోని డబ్బును భద్రంగా దాచిపెట్టి, ఆ తర్వాత తన పరిశోధనకై బయలుదేరటానికి.

సబ్ పోస్టు మాస్టర్, నారాయణని పిలిచాడు నవ్వుతూ.

"మీ కెవరో ఫోన్ చేశారండీ! బయటికెళ్ళారని చెప్పాను. రాంగానే మళ్ళీ ఫోన్ చెయ్యమన్నారు!" అంటూ ఏదో నెంబరు నోట్ చేసి ఉన్న స్లిప్‌ని అందించాడు.

అక్కడికక్కడే నారాయణరావు ఫోన్ ఎత్తి డయల్ చేశాడు.

"ఎవరు కావాలండీ?" కంగారుగా అవతలి కంఠం అడిగింది.

"నేను డిటెక్టివ్ నారాయణరావుని మాట్లాడుతున్నాను. నాకోసం ఎవరో ఫోన్ చేశారట ఇందాక!"

"ఓ నారాయణరావుగారా? మీరు త్వరగా ఇక్కడికి రావాలి! నన్ను చంపుతామని బెదిరిస్తున్నారెవరో! మొదటిది, మీ రీ రాత్రి నాకు రక్షణగా ఉండాలి! రెండోది నన్ను బెదిరిస్తున్న వ్యక్తులెవరో పట్టుకోవాలి! నేను "తెరవెనుక న్యూస్" పత్రిక ఎడిటర్ అర్జునరావుని మాట్లాడుతూంట!"

నారాయణరావు క్షణం కొయ్యబారిపోయాడు. వెంటనే తేరుకుని—

"మిమ్మల్నెవరు బెదిరించారు? ఎలా బెదిరించారు? వివరంగా చెప్పండి?"

"ఇందాక ఫోన్ చేశారెవరో! ఆ కంఠం ఫోన్‌లో గర గరమందే కానీ స్పష్టంగా వినిపించలేదు. ఆ విషయాలన్నీ మీరిక్కడకు వచ్చాక మాట్లాడుకోవచ్చును. మీ రీ రాత్రి నాకు సాయంగా నిలవండి! మీ ఫీజు ఎంతైనా సరే?"

నారాయణరావు ఒక్కక్షణం తటపటాయించాడు. ఈ కేసుని ఒప్పుకోవటమా, మానటమా అనే సందిగ్ధంలో పడ్డాడు. ఒకరు బ్లాక్ మెయిలర్! మరొకరు బ్లాక్ మెయిల్ చేయబడుతున్న వ్యక్తి. ఇద్దరు కేసుల్ని విభిన్న ధృవాల్లాంటి వాటిని ఒకేసారి ఎలా చేపట్టగలడు?

అయినా తను వెదకబోయిన తీగ కాలికి తగిలింది. ఈ అవకాశాన్ని వినియోగించుకుని 'మాలిని'కి సంబంధించిన రికార్డు మాత్రం సంగ్రహించు రాగలిగితే, తన మొదటి కేసన్నా విజయవంతం అవుతుంది.

"ఏమండీ! వింటున్నారా నా మాట? తర్వాత పక్ష పత్రిక ప్రచురణను ఆపకపోతే నన్ను చంపేస్తామంటు న్నారు! కానీ! నా జీవనాధారం ఈ పత్రికే కదా?"

"పోనీ ఈ పక్షపత్రికను మాత్రం నిలుపు చేస్తాననక పోయారా?"

"అంటే? వాళ్ళ బెదిరింపులకు బెదిరిపోయి నన్ను సత్యాన్ని వెల్లడించకుండా మరుగుపరచమంటారా?"

"పోనీ పోలీసులకు తెలియజేయకపోయారా? వాళ్ళని రక్షణకోసం అడగవచ్చుకదా!"

"లాభంలేదు. ఆకాశరామన్న బెదిరింపుల్ని వాళ్ళు లెక్కలోకి తీసుకోమన్నారు. అందుకే మీ ప్రకటన చూడంగానే, మీకు ఫోన్ చేస్తున్నాను సార్! మీరు ఎంతసేపట్లో రాగలరు ఇక్కడకు?"

నారాయణరావు బరువుగా నిట్టూర్చాడు. "క్షమించాలి! మీ కేసు చేపట్టటమో, నిరాకరించడమో ఆలోచించిగాని నిర్ణయించుకోలేను. ఎందుకనంటే నేనిప్పుడే మరొకరి కేసు ఒప్పుకున్నాను, అదీ మీకు సంబంధించినదే? నా క్లయింట్ గూడ మీకు ప్రత్యర్థే! మీరు చనిపోతే అతడు ఇంకా సంతోషిస్తాడేమో గూడ!"

"ఇది అన్యాయం! డిటెక్టివ్ అన్నవాడు చేతనైతే హత్య జరక్కుండా కాపాడాలి! అంతేకానీ ఒక హంతకుడికి సాయపడరాదు తెలుసా?"

"ఏం? నీవు చేసే పని మాత్రం న్యాయమైనదా? ఇతర వ్యక్తుల బలహీనతల్ని ఆరా తీసి, వాటిని పేపరుకెక్కిస్తానని బ్లాక్ మెయిల్ చెయ్యటం మాత్రం నేరం కాదూ? అందుకే నేను మీ కేసు విషయం ఆలోచించినమీదట గానీ ఏ నిర్ణయానికీ రాలేను. సాయంకాలం సరిగ్గా ఆరు గంటలకు మీ ఆఫీసుకు వస్తాను. ఈలోపల మీరుగూడ మీరు చేస్తున్న బ్లాక్ మెయిల్ కు స్వస్తిచెప్పే విధానం ఆలోచించండి! అప్పుడే నావల్ల మీకు సాయం లభించగలదు," నారాయణరావు ఫోన్ పెట్టేశాడు.

సబ్ పోస్ట్‌మాస్టర్ కి థ్యాంక్స్ చెప్పి తన రూమ్‌లోకి తిరిగివచ్చాడు నారాయణరావు.

3

క్లాక్ టవర్ లో సరిగా ఆరుగంటలు కొడుతోంది, 'తెర వెనుక న్యూస్' ఆఫీసు చేరుకునేసరికి.

అప్పటికి ఆఫీసులో పని చేసేవాళ్లూ, ప్రెస్ లో పని చేసే కంపోజిటర్లు అందరూ వెళ్ళిపోయినట్టున్నారు, ఆఫీసంతా బోసిగా ఉంది.

ముందు హాలు దాటుకుని ఎడిటర్ రూమ్ దగ్గరకు వెళ్ళాడు నారాయణరావు. గదిలో లైటు వెలుగుతోంది. గది తలుపులు వారగా వేసి ఉన్నయ్.

తలుపు నెట్టుకుని గదిలోకి అడుగుపెట్టిన నారాయణ రావు అలాగే బ్రమ్మపడిపోయాడు.

తనకన్న పదినిముషాల ముందే, అర్జునరావు దగ్గరకు మరో విజిటర్ వచ్చాడు. అదే మృత్యువు.

మృత్యువే ముందు చేరింది అర్జునరావుని, తనకన్న కొద్ది క్షణాల వ్యవధిలో.

కణతల్లోంచి ఇంకా రక్తపుచారికలు ఎర్రగా ఉండటం మూలాన్ని అతడు చనిపోయి పదినిముషాలకన్న కాలేదని తెలుస్తోంది.

కాగితాలూ, ఫైళ్ళూ పేరుకున్న టేబుల్‌కి అవల రివాల్వింగ్ ఛెయిర్‌లో కూర్చుని, వెనక్కి వాలివున్నాడు చనిపోయిన అర్జునరావు. అతడి కళ్ళుమాత్రం తెరుచుకునే ఉన్నాయి. అతడి ముఖాన నెత్తురు మరకలు లేకపోతే, అతడింకా జీవించివున్నాడనే భావన కలుగుతుంది.

నారాయణరావు చుట్టూ కలయజూశాడు. ఒకప్రక్క గది తలుపుకున్న లాక్‌ని ఎవరో రివాల్వర్‌తో కాల్చారు.

మునిగాళ్ళమీద నడుస్తూ, టేబుల్‌ని తాకకుండా, దానిమీదకు వంగి, అక్కడున్న కాగితాల్ని చదవటానికి యత్నించాడు నారాయణరావు. అవి బహుశా తనకు కావలసినవే అయి ఉండచ్చేమో అని!

కానీ అవి 'మాలిని' గురించినవి కావు. ఎవరో నూతన దర్శకుడికీ, గ్లామర్ తగ్గిపోతున్న తారకీ మధ్య జరిగిన ప్రేమకలాపం గురించిన సమాచారం అది!

అయితే, అర్జునరావుని హత్యచేసిన వ్యక్తులు, ప్రక్క గదిలోని రికార్డురూమ్ శోధించి, వాళ్ళకు కావాల్సినవి సంగ్రహించుకు పోయివుంటారు. అంటే వాళ్ళూ, తన లాగే, త్వరలో 'తెరవెనుక న్యూస్'లో ప్రచురింపబడే అభ్యంతర సమాచారం ప్రచురింపబడకుండా నిరోధించ టానికే వచ్చివుంటారు.

నారాయణరావు ప్రక్కగదిలోకి జొరబడ్డాడు ఆత్రంగా. ఆ గదిలో ఫైలింగ్ క్యాబినెట్ ఉంది. అక్షర మాల క్రమంలో A నుంచి Z వరకు వివిధ అరలున్నై!

మాలినికి సంబంధించిన సమాచారంకోసం 'M' అర తెరిచాడు. అందులో గబగబ కవర్లు తిరగేశాడు.

పైన మాలిని అని ఉన్న కవర్ని తీసుకుని, దాన్ని తెరిచి చూశాడు నారాయణరావు. ఒక ఒరిజినల్, రెండు కార్బన్ కాపీలు ఉన్నయ్ అందులో. ఒక్కొక్కటీ ఎనిమిది పేజీలుంది. ఫొటోలు ఏమీ లేవు.

ఆ కవర్ని స్లాక్ షర్ట్ లోపలిజేబులో దోపుకున్నాడు. అంతలోనే అతడికేదో ఆలోచన మెరిసింది. ప్యాంటు జేబులోంచి గుడ్డసంచీని తీశాడు. డ్రాయర్లోని ప్రఖ్యాత తారల పేర్లున్న కవర్లను చకచక ఏరి సంచీలో వేసు కున్నాడు.

మాలిని విషయంలో చంద్రశేఖర్ తన సహాయం అర్థించినట్టుగానే ఈ ప్రఖ్యాత తారల్లో ఎవరైనా తన సహాయం కోరవచ్చు. అప్పు డీ కవర్లలోని వ్రాతప్రతులు తనకు ఎంతైనా లాభకరంగా ఉంటయ్.

గుండెల నిండా ఊపిరి పీల్చుకున్నాడు నారాయణ రావు. ఎడిటర్ రూమ్‌లోకి వచ్చి టెలిఫోన్ దగ్గరకు నడి చాడు రిసీవరెత్తి డయల్ చేశాడు.

"ఎవరూ? చంద్రశేఖరేనా మాట్లాడుతూంట? మాలిని గురించిన వ్రాత ప్రతులు నా చేతికొచ్చినయ్."

"ఏమిటీ? నిజంగానా? అప్పుడే వాటిని జేజిక్కించుకున్నావా?" నమ్మలేనట్టుగా, ఆశ్చర్యంగా అడిగాడు చంద్రశేఖర్ ఫోన్‌లో.

"అవును! ఒరిజినల్ వ్రాతప్రతీ, రెండు కార్బన్ కాపీల ప్రతులూ ఉన్నయ్! ఫొటోలేం లేవు?"

"నిజంగా అఖండుడివే నీవు! ఏమాత్రం ఖర్చు పెట్టావేమిటి?" చంద్రశేఖర్ తన వ్యాపారపు సరళిలో మాట్లాడాడు.

"ఏంతోనా? ఒక మనిషి జీవితం! అర్థమయిందా? అర్జునరావు ప్రాణాలు కోల్పోయాడు."

చంద్రశేఖర్ ఆశ్చర్యాన్ని ఆతృతనూ కనపరిచాడు. "ఏమిటీ! హత్యే? అవున్లె! మిలటరీ వాడివి కదూ? శత్రువుల్ని పిట్టల్ని కాల్చినట్టుగా కాల్చి చంపటం అలవాటే గదూ? కానీ నీవీ రకంగా పని సాధిస్తావని కలలో గూడ అనుకోలేదు సుమా!"

"మిస్టర్ చంద్రశేఖర్! నా మాటలు పూర్తిగా వినకుండానే అలా అతి ప్రసంగం చెయ్యకు! ఈ హత్య నేనే చేశానని ఎవరన్నారు?"

"పోనీలే! అంతవరకన్న జాగ్రత్త పడ్డావ్! అబ్బాయ్ హత్యా ప్రదేశంలో అట్టేసేపు తారాడక, పోలీసులు వచ్చేలోపలే త్వరగా వెళ్ళిపో. మాలిని కాగితాల్ని నాకు చేర్చటం మర్చిపోకు."

అతడి ఉచిత సలహాకు నారాయణరావు నవ్వుకున్నాడు. లైన్ కట్ చేశాడు, అట్టె కాలయాపన మంచిది కాదని.

పోలీస్ స్టేషన్‌కి డయల్ చేశాడు మళ్ళీ.

ఇన్‌స్పెక్టర్ రాజు బదులు పలికాడు. అతడికి తానెవరో, అక్కడికి ఎందుకు వచ్చాడో తెలియజేస్తూ, అక్కడ హత్య జరిగినట్టుగా తెలియజెప్పాడు.

చంద్రశేఖర్ చెప్పినదానికి సరిగా వ్యతిరేకంగా చెప్పాడు ఇన్‌స్పెక్టర్ రాజు. తాము వెంటనే క్షణాల మీద అక్కడకు చేరుకోబోతున్నామనీ, అంతవరకూ నారాయణరావుని అక్కడే ఉండమనీ కోరాడు ఇన్‌స్పెక్టర్.

నిర్జీవంగా పడి వున్న శవానికి కాపలా కాస్తూ, వాకిట్లోనే వెయిట్ చేస్తున్నాడు నారాయణరావు.

కొద్ది క్షణాల్లోనే పోలీసులు వచ్చేశారు రంగం మీదకు. తాపీగా సిగరెట్ కాలుస్తూన్న నారాయణ రావు, కుర్చీలోంచి లేచి వెళ్ళి ఇన్‌స్పెక్టర్‌ని రిసీవ్ చేసుకున్నాడు.

ఇన్‌స్పెక్టరూ, పోలీస్ ఫొటోగ్రాఫరూ శవాన్ని తాకకుండా, కదలించకుండా అన్ని కోణాల్లోంచి చూస్తూ ఫోటోలు తీస్తున్నారు. మరికొందరు పోలీసులు హడావిడిగా అటూ ఇటూ తిరుగుతున్నారు, సినిమాలో ఎక్‌స్ట్రాల్లాగ.

"మీరే కదా మాకు ఫోన్ చేసింది? మీ రెందుకు వచ్చారిక్కడకు?" ఇన్‌స్పెక్టర్ అడిగాడు నారాయణ రావు వంక చూస్తూ.

డిటెక్టివ్ నారాయణరావు టూకీగా చెప్పాడు. అటు చంద్రశేఖర్ గురించి కానీ, మాలిని గురించిన ప్రస్తావన కానీ రానివ్వకుండా, అర్జునరావే తన సహాయం కోరాడనీ

ఆ విషయమై ప్రస్తావించేందుకే తాను సరిగ్గా ఆరు గంట లకు వచ్చాడనీ, అప్పటికే అతడు యమసదనానికి చేరా డని వివరించాడు.

"ఫోన్‌లో అర్జునరావు నీతో ఏం చెప్పాడు?"

"నా కోసం అర్జునరావే ఫోన్ చేశాడు. తన నెవరో హత్య చేస్తానని బెదిరిస్తున్నారని చెప్పాడు. అలా బెదిరి స్తున్న వారి ఆచూకీ పట్టుకోవలసిందిగా అర్థించాడు. ఆ విషయమై పూర్తి వివరాలు తెలుసుకుందామనీ, అతడితో ముఖా ముఖి సంప్రదించాలనీ వచ్చాను. నేను వచ్చేసరికే అతడ్నెవరో హత్య చేసేశారు. హంతకుడు నా రాక గ్రహించి లోపల ఎక్కడన్నా దాక్కున్నాడేమో అని ఇల్లంతా వెదికాను. ఆ తర్వాత మీకు ఫోన్ చేశాను."

ఆ తర్వాత ఇన్‌స్పెక్టర్ దగ్గర సెలవు తీసుకొని ఇంటికి బయలుదేరాడు నారాయణరావు.

4

నారాయణరావు అలసిన శరీరంతో తన బసకు చేరుకు న్నాడు. డ్రెస్ విప్పి స్టాండ్ మీద వేశాడు. కొద్దిగా విస్కీ తాగి తలగడ మీద తలగడ పెట్టుకొని బెడ్ మీద వాలిపోయాడు.

తీరిగ్గా ఆలోచిస్తూ అర్జునరావు హత్య కేసులో తన పాత్రను మరోసారి సమీక్షించాడు. మాలిని గురించిన వ్యాసం తాలూకు వ్రాత ప్రతులు తన దగ్గర భద్రంగా ఉన్నాయ్. వాటి కోసమై తను తెర వెనుక న్యూస్ కార్యాలయానికి వచ్చినట్టుగా మాత్రం పోలీసులకు వెల్లడి చేయలేదు తను.

తలుపు మీద చిన్నగా చప్పుడయింది, ఎవరో చిటిక వేస్తున్నట్టుగా.

నారాయణరావు ఉలిక్కిపడ్డాడు. ఆ వచ్చింది పోలీసులు గానీ, లేక చంద్రశేఖరంగానీ అయి ఉంటారా అనిపించింది. వాళ్ళయితే తలుపుని గట్టిగా తట్టేవాళ్ళే! ఇలా నెమ్మదిగా, ప్రక్కింటి వాటాలోని భర్త చాటు స్త్రీలాగ ఎందుకు గీరుతుంది అనుకున్నాడు అంతలోనే!

తలుపు తెరిచేసరికి గుమ్మంలో చిరునవ్వులు చిందిస్తూ నిలబడి ఉంది ఎక్స్ట్రా నటి రాణి.

తను నాలుగంతస్తుల మేడలో ఉంటున్నాడు. ఆ మేడలో అన్నీ డబుల్ రూమ్ పోర్షన్సే! పైగా అన్నిటిలోనూ తనలాటి బ్రహ్మచారులే—ఆడా, మగా బ్రహ్మచారులు ఉంటున్నారు. రాణి గూడ వాళ్ళలో ఒకతె!

"లోపలకు రావచ్చా?" అనడిగింది రాణి.

"రాత్రివేళ అందమైన యువతి గుమ్మంలో నుంచుని రావచ్చా అని అడిగితే ఏ మగాడు వద్దంటాడు?"

"మీరు పర్మిషన్ లేకుండానే రావచ్చు!" అంటూ ఆమెను లోపలకు రానిచ్చి తలుపు మూసేశాడు నారాయణరావు.

"ఒళ్ళంతా నొప్పులుగా ఉంది. ఇవాళెవరూ క్లయింట్స్ గూడా తగల్లేదు. మీ దగ్గర మందేమన్నా ఉందేమోనని వచ్చాను!" అంది రాణి వయ్యారంగా ఒళ్లు విరుచుకుంటూ.

"అబ్బో! మందు కావాలంటే చాలా ఖరీదవుతుందే?" నారాయణరావు ఆమె వంక ఓరగా చూస్తూ, కొంటెగా నవ్వాడు.

"అందు కభ్యంతరమా! ప్రస్తుతం నా దగ్గరున్నదంతా మీదే!" అంటూ రాణి సర్వ స్వతంత్రంగా బెడ్ మీద కూర్చుని సీసాలో ద్రవాన్ని పోసుకుని గటగట త్రాగే

సింది. ఆ తర్వాత చేతులు చాచి నారాయణరావుని ఆహ్వానించింది.

రాణి వ్యక్తిగత జీవితం నారాయణరావుకి తెలియక పోలేదు. ఆమె ఇక్కడ ఒంటరిగా ఉంటోంది. సినిమాలో వేషాలు ఎప్పుడోగానీ దొరకవు. అందుకే ఆమె ఒళ్ళు అమ్ముకొని జీవిస్తోంది.

ఆమె దగ్గరకు వచ్చేవాళ్ళంతా మధ్య వయసు వాళ్ళే. డబ్బున్న ధనికులు. ఒక్కో వారం ఒక్కోరు వచ్చి పోతుంటారు. బహుశా ఆమెలో వారిని ఉత్తేజపరిచే కీలకం ఉండి వుంటుంది. కనుకనే ఆమె దగ్గరకే విధిగా, క్రమం తప్పకుండా వస్తుంటారు.

5

తెల్లవారుజామున నారాయణరావుకి మెలకువ వచ్చింది. అతడిప్రక్కనే రాణి ఇంకా నిద్రపోతూనే ఉంది.

నెమ్మదిగా లేచాడు నారాయణరావు. గదిలో ఒక మూల తను 'తెరవెనుక న్యూస్' ఆఫీసునుంచి తెచ్చిన కాగితాల కట్టలున్న సంచీ ఉంది. ఎందుకైనా మంచిది, వాటిని మరెక్కడన్నా దాస్తే బాగుండు ననుకున్నాడు నారాయణరావు. కానీ ఎక్కడ దాచాలో అంతు పట్ట లేదు. ఇవాళ రేపట్లో పోలీసులు తన గదిని సోదాచేసినా చెయ్యవచ్చు. కనుక ఆ కాగితాలు తన గదిలో ఏమాత్రం ఉండకూడదు.

టీపాయ్‌మీద తాళాలు కనుపించినయ్. అవి రాణి పోర్షన్ తాలూకువి. నారాయణరావు మనసులోకి మెరుపులా ఆలోచన వచ్చింది.

తను తెచ్చిన బ్యాగ్‌ని తీసుకెళ్ళి రాణి ఇంట్లో, విడిచే

సిన గుడ్డలపెట్టె అడుగున భద్రపరిచాడు.

కాలకృత్యాలు తీర్చుకుని ఆఫీసుకు చేరుకునేసరికి, అతడికోసం అప్పుడే ఫోన్ కాల్ వచ్చింది.

నారాయణరావు కాల్ అందుకున్నాడు.

"హలో డిటెక్టివ్ నారాయణరావ్! నేను చంద్రశేఖరాన్ని మాట్లాడుతూంట! ఆ కాగితాల్ని నాకెప్పుడు చేరుస్తావ్?"

నారాయణరావుకి చిర్రెత్తుకొచ్చింది. నా కిష్టమయినప్పుడు ఇస్తాను సరా!"

"నాకు ఇప్పుడే కావాలి!" బాస్‌లాగ పలికాడు చంద్రశేఖరం.

"అలాగే తెస్తాను. నా వెనుకే పోలీసులుగూడ వస్తారు. వాళ్ళు నామీద నిఘా ఉంచారేమో అని నా అనుమానం!"

"నిజంగా! నీమీద నిఘావేశారా పోలీసులు?"

"అని నా అనుమానం. కనుక ఒకటి రెండు రోజుల్లో, ఎలాగో వీలుచేసుకుని తెచ్చిస్తాను సరా!"

"అబ్బా! రెండురోజులే! అంతదాకా నా ప్రాణం ఓపలేదు. సాయంత్రంలోగా, నీవు ఎన్ని తిప్పలన్నా పడి, వాటిని నాకు చేర్చావో, నీకు మరో వెయ్యిరూపాయలు అదనంగా ఇస్తాను సరా?" చంద్రశేఖరం బేరంలోకి దిగాడు.

"సరే! అయితే సాయంత్రంలోగా ప్రయత్నిస్తాను." టెలిఫోన్ పెట్టేసి తన ఆఫీసులో ప్రవేశించాడు.

పిట్టగోడకానుకుని నిలబడి తననెవరైనా 'వాచ్' చేస్తున్నారా అని పరిశీలనగా చూశాడు చుట్టూరా. కొద్ది క్షణాలు చూశాక ఎవరూ తనకోసం నిఘా వేయలేదని

నిర్ధారణ చేసుకున్నాడు. తర్వాత మాలిని గురించిన వ్యాసాన్ని తీసి తీరిగ్గా చదివాడు, కుర్చీలో కూర్చుని. ఆమెతో గడిపిన యువకుడు ఎవరోగానీ, ఆ వ్యాసంలో వారిద్దరి శృంగారం చదువుతూంటే, నారాయణరావుకే వెర్రెత్తిపోయింది. సెక్స్ పత్రికల్లో పడే కథలకన్న పచ్చి బూతుగా వుంది ఆ వ్యాసం. యువకుల్లో రక్తాన్ని వేడెక్కించే అలాంటి వ్యాసాల్ని ప్రచురించటంవల్లనే అర్జునరావు నడుపుతూన్న పత్రిక వేడివేడి పకోడీల్లా అమ్ముడుపోతోంది అనుకున్నాడు మనసులో నారాయణరావు.

ఆ వ్యాసం తాలూకు ప్రతిని ఒకదాన్ని తన రూమ్‌లో భద్రపరిచాడు నారాయణరావు. మరో ప్రతినీ, ఒరిజినల్నీ తీసుకుని చంద్రశేఖరాన్ని కలుసుకునే నిమిత్తం బయలుదేరాడు.

తన రాకకోసమే ఎదురుచూస్తున్నవాడిలా చంద్రశేఖరం ఒంటరిగా కాచుకూర్చుని వున్నాడు.

జేబులోంచి కవరు తీసి చంద్రశేఖరం ముందు పడేశాడు నారాయణరావు. అతడు ఆ వ్యాసాన్ని తీసి ఆతృతగా చదువుతుంటే, బల్లమీది సిగరెట్ ప్యాకెట్స్ అందుకుని, తాపీగా సిగరెట్‌ని వెలిగించాడు నారాయణరావు.

"దీనికోసమై అర్జునరావుని నీవేం చేయలేదు గదా?" చదవడం పూర్తయాక చంద్రశేఖరం అడిగాడు.

"లేదు! నా శ్రమ లేకుండా, యెవరో నా రాకకు ముందే అతడికి టిక్కెట్టు ఇచ్చేశారు. కాగా పోగా నా అనుమానం నీవే ఆ పని చేయించలేదు గదా అని?" కొనకంటితో చిలిపిగా చూస్తూ అడిగాడు నారాయణరావు.

"నీకేం మతిపోయిందా? అతడ్ని హత్య చేయించాల్సిన పని నాకేముంది? కాకపోతే డబ్బు పారేసి నీలాంటి

కిరాయి మనుష్యుల్ని ఇంకా పదిమందిని పెడతాను. నాకు కావలసిన కాగితాల్ని తెప్పించుకుంటాను. దీనికోసం నా చేతుల్ని ఎందుకు ఖరాబు చేసుకోవాలి? అయినా ఆ విధంగా నీవే అనుమానిస్తున్నావా? లేక పోలీసులకు కలిగిందా ఆ ప్రశ్న?"

"లేదు. నేనే ఊరికే అడిగాను!"

"చంపావ్ పో! ఇదిగో నాయనా! ఇక ఎన్నడూ అలాంటి వెధవ 'విట్'లు వెయ్యకు. నాకు అసలే గుండె పోటు గూడాను. తపీమని చెప్పా చెయ్యకుండా, నా గుండె ఆగిపోతుంది గూడ!"

"అలాగా! అయితే నా పొరబాటుకి మన్నించండి. పోతే మీరు ఫోన్‌లో వాగ్దానం చేసిన అదనపు ఫీజు గురించి..."

"తప్పకుండా! ఈ చంద్రశేఖరం డబ్బుదగ్గర వెనుకాడే వ్యక్తి కాదు. మాటంటే మాటే!" అంటూ డ్రాయర్ సొరుగు తెరచి వెయ్యిరూపాయలు నారాయణరావు ముందు పడేశాడు. "నీ సామర్థ్యం గురించి నా ఫ్రెండ్స్‌కికూడా తెలియజెప్పి, నీకింకా కేసులు తగిలేలా చూస్తాను సరా!"

"మీ సహాయానికి కృతజ్ఞుడ్ని. ఇక నాకు సెలవు ఇప్పిస్తారా?" నారాయణరావు కుర్చీలోంచి లేవబోయాడు.

"ఇక ఈ వ్యాసం తాలూకు ప్రతులు ఆ పత్రిక ఆఫీసులో గానీ, మరెక్కడన్నా గానీ లేనట్టేగదా?" అనుమానంగా చూస్తూ అడిగాడు, చంద్రశేఖరం.

"నా దగ్గర కార్బన్ కాపీ ఉంది. మేం చేపట్టిన మొదటి కేసు గనుక, దాని తాలూకు రికార్డు ఏదైనా మా దగ్గర ఉండటం సమంజసంగా తోచింది నాకు.

దాన్ని ఇతరు లెవరికీ చూపించనని ప్రమాణం చేస్తున్నాను.''

చంద్రశేఖరం ముఖం అంతలోనే వివర్ణమైంది. కోపంతో కళ్ళు ఎరుపెక్కాయి. ''చాల్లే నిర్వాకం! నిన్ను నమ్మినందుకు నన్నే మోసం చేస్తానంటావా? రేపు సాయంత్రం లోపల ఆ కాపీ గూడ నాకు తెచ్చి ఇవ్వు!'' అని అరిచాడు.

''ఇవ్వకపోతేనో?''

''ఇచ్చి తీరాలి!''

''ఏం బెదిరిస్తున్నారా? డిటెక్టివ్‌లు అన్యాయమైన పనుల్ని చేయరని మీకు తెలియదేమో?''

''మిస్టర్! నీవు ఎలాగైనా అనుకో! మాలినికి సంబంధించిన కాగితా లన్నిటినీ నాకు చేర్చే ఒప్పందం మీదనే నిన్నీ పనికి నియమించాను. కనుక నీవు నా మాటకు కట్టుబడి ఉండటమే క్షేమం!''

నారాయణరావు ఒక్క క్షణం ఆలోచించాడు. ''సరే! ఇక్కడ మీరే అధినేతలు. మీరు చెప్పిన మార్గాన పోవటమే నా విధి! అలాగే తెచ్చిస్తాను'' అంటూ అక్కడ్నుంచి విసురుగా బయటికి వచ్చాడు నారాయణరావు.

6

ఆఫీసుకి తిరిగి వస్తూ, దోవలో నారాయణరావు అదే పనిగా ఆలోచిస్తున్నాడు, అర్జునరావుని ఎవరు హత్యచేసి ఉంటారా అని. చంద్రశేఖరం ఆ పని చేయించి ఉండడనే అనిపిస్తోంది అతడి అంతరాత్మకు. అతడే గనుక ఈ హత్యకు సిద్ధపడి ఉంటే, మాలిని ఉదంతం గురించిన కాగితాలకోసం తన నెందుకు నియమిస్తాడు? హత్యానంతరం తీరిగ్గా అర్జునరావు ఆఫీసంతా సోదాచేసి అతడికి కావలసిన

కాగితాల్ని వెదికి తీసుకునే వాడే గదా!

మరయితే అర్జునరావుని హత్య చేయాల్సిన అవసరం మరెవరికి ఉంటుంది? 'తెరవెనుక న్యూస్' పక్ష పత్రికలో మాలిని ఉదంతం లాంటివే ఇంకా బోలెడన్ని వ్యాసాలు ఉన్నాయ్. ఆ వ్యాసాల ప్రచురణవలన అప్రతిష్టపాలవుతా మనే భయం గల అనేకమందిలో ఏ ఒకరికైనా అర్జున రావుని హతమార్చే అవసరం ఉండవచ్చు! అతడి ఆచూకీ ఎలా చిక్కించుకోవాలి?

ఆలోచిస్తూనే మెల్లెక్కుతుండగా, టెలిఫోన్ రంయ్ మని మ్రోగింది. అది తనకోసమే అయి ఉండవచ్చని అతడి అంతరాత్మ అరిచింది. అలానే మెట్ల మీదనే ఆగి పోయాడు.

రిసీవరెత్తి, కాల్‌ని అందుకున్న సబ్ పోస్టుమాస్టర్ నవ్వుతూ అరిచాడు, "సార్ నారాయణరావుగారూ! మీకే నండీ కాల్!"

నారాయణరావు ఫోన్ దగ్గరకు నడిచాడు.

"నా మాట విని మీరూ ఫోన్ పెట్టించుకోండి సార్!" సబ్ పోస్టుమాస్టర్ ఛలోక్తిగా అన్నాడు.

"హలో! నారాయణరావు మాట్లాడుతూంట!"

"హలో నారాయణరావ్! నేను ఇన్‌స్పెక్టర్ రాజు మాట్లాడుతున్నాను. మీరు స్టేషన్‌కి ఎంతసేపట్లో రాగలరు?"

"కొంచెం బిజీగా ఉన్నాను. రేపుదయం కలుసు కుంటాను తీరిగ్గా!"

"అలా వీల్లేదు! తక్షణమే, ఉన్నపళాన రావాలి! లేదంటే రాజలాంఛనాలతో, మందీ మార్బలంతో నేనే రప్పించుకోవాల్సి ఉంటుంది."

అంటే నలుగురు పోలీసుల్ని పంపి, తనను పోలీస్ వ్యాన్‌లో ఎక్కించి తీసుకువెడతారన్నమాట అనుకున్నాడు నారాయణరావు.

"మీకంత శ్రమ అక్కర్లేదు. ఇదో ఇప్పుడే బయలుదేరి వస్తున్నాను గురూ!"

"అలా బుద్ధిమంతుడివనిపించుకో!" ఇన్‌స్పెక్టర్ ఫోన్ పెట్టేశాడు.

మరో పావుగంటలో నారాయణరావు ఇన్‌స్పెక్టర్ సమక్షంలో ఉన్నాడు.

"మిస్టర్ నారాయణరావ్! లోగడ ఎప్పుడైనా నీ జీవితంలో పోలీసువారి ఆతిథ్యం పొందావా?"

"లేదు! మిలిటరీలో అప్పుడప్పుడు, చేసిన పొరబాట్లకు చిన్న చిన్న శిక్షలు తప్పించి, ఏనాడూ 'డార్క్ సెల్' లోకి గాని, మిలిటరీ జైలుకిగానీ వెళ్ళి ఎరుగను!"

"మనం కూర్చున్న చోటునుంచి లాకప్‌గది ఎంత దూరం ఉంటుందంటావ్?"

"సుమారు పది అడుగులు!" అన్నాడు నారాయణరావు తనకూ లాకప్ రూమ్‌కీ మధ్య దూరాన్ని అంచెనా వేస్తూ.

"నేనిప్పుడు కొన్ని ప్రశ్నలడగబోతున్నాను. వాటికి కరెక్టుగా సమాధానం చెబితే లాకప్ రూమ్ నుంచి ఒక్కో ప్రశ్నకూ ఒక అడుగు ఇవతల పడతావ్. తప్పు చెప్పిన ప్రతిసారికీ ఒక అడుగు లాకప్ గదికి చేరువ అవుతావు! ఆ విషయం బాగా గుర్తుంచుకో."

"మీ వాక్చాతుర్యానికి నా అభినందనలు. ఇక మీ ప్రశ్నలేమిటో వినాలన్న కుతూహలం ఎక్కువౌతోంది, అంతకంతకూ!"

మొదటి ప్రశ్న: "నీవు ఎవరి తరఫున పని చేస్తున్నావ్?"

"అర్జునరావ్! అతడే నాకు ఫోన్ చేశాడు. తననెవరో చంపుతామని బెదిరిస్తున్నట్టు చెప్పాడు. తాత్కాలిక రక్షణ కోసమూ, ఆ బెదిరింపుదార్లను శోధించి పట్టుకునేందుకూ అర్జునరావే నా సాయం కోరాడు."

"అతడుగాక ఇంకెవరూ నీ క్లయింట్స్ లేరా?" సూటిగా కళ్ళల్లోకి చూస్తూ అడిగాడు ఇన్స్పెక్టర్ రాజు.

తను మనసులో దాస్తున్న విషయాలన్నీ ఇన్స్పెక్టర్ ఎలా పసిగట్టి చెప్పగలిగాడా అని అబ్బురపడ్డాడు నారాయణరావు.

"సినీ దర్శక నిర్మాత చంద్రశేఖరం!" నిజాన్ని అయిష్టంగానే వెళ్ళగక్కాడు.

"ఒక అడుగు ఇవతల పడ్డావ్ జైలు గేటు నుంచీ! రెండో ప్రశ్న: చంద్రశేఖరానికి ఏవిధంగా సహాయపడాలనుకున్నావ్?"

"అతడికి సంబంధించిన అభ్యంతరకరమైన సమాచారాన్ని అర్జునరావు తన పత్రికలో ప్రచురించబోతున్నాడని తెలిసింది. ఆ వ్యాసం ప్రచురణ అవక ముందే, దాన్ని తెచ్చి ఇవ్వమని కోరాడు చంద్రశేఖరం నన్ను. అర్జునరావుకి నయానో, భయానో నచ్చజెప్పి, దాన్ని తేవాలనే నేనూ అతడి ఆఫీసుకు వెళ్ళాను."

"ఓహ్! నా సర్వీసులో నిజాన్ని ఇంత నిర్భయంగా వెళ్ళబెట్టిన అనుమానితుల్ని చూడలేదంటే నమ్ము. నీవే గనుక ఈ విషయం చెప్పకపోయివుంటే, అర్జునరావు

ఆఫీసులోకి దొంగతనంగా జొరబడి హత్య చేశావన్న నేరానికి నిన్ను అరెస్టు చేసేవాడ్ని."

"నేను దొంగతనంగా జొరబడలేదు. అప్పటికే ఎవరో లోపల గదిలోని డ్రాయర్లు శోధించారు. వాళ్ళే అర్జునరావుని హత్య చేసి ఉంటారని నా అనుమానం!"

"నీవు వెళ్ళింది ఎవర్ని గురించిన సమాచారం కోసం?"

"ప్రఖ్యాత వెండితెర హీరోయిన్ మాలిని గురించిన ఉదంతం విషయమై."

"ఏమిటా ఉదంతం?" ఇన్‌స్పెక్టర్ ఆసక్తిగా చూశాడు.

"నేనైతే దాన్ని ఆసాంతం చదవలేదు!" ధైర్యంగా చిన్న అబద్ధమాడేశాడు నారాయణరావు.

"ఇప్పుడా వ్రాతపతి ఎక్కడుంది?"

"చంద్రశేఖరం ఐరన్ సేఫ్‌లో!"

"అయితే హత్యకాబడ్డ అర్జునరావు, 'తెరవెనుక న్యూస్' పక్షపత్రికకు ఏకైక ఎడిటర్, పెద్ద బ్లాక్ మెయిలర్ అన్నమాట!"

"అలాగే తోస్తున్నది ఈ కేసుని చూస్తుంటే!"

"మా డిపార్టుమెంట్ వేలిముద్రల నిపుణులు, అర్జునరావు ఆఫీసు డ్రాయర్లమీదా, సొరుగులమీద నీ వేలిముద్రల్ని పసిగట్టారు. అందుకే నిన్ను క్షణాలమీద రప్పించాను. ఇక నీవు వెళ్ళచ్చు! నిన్ను అనుమానితుడిగా అరెస్టు చెయ్యాల్సి వస్తుందనుకున్నాను. కానీ నిజాన్ని నిర్భయంగా చెప్పి, మాకా శ్రమను తప్పించావ్!"

నారాయణరావు ఇన్‌స్పెక్టర్‌కు కృతజ్ఞత చెప్పుకొని అక్కడ్నుంచి బయటపడ్డాడు.

అర్జునరావు హత్య కాబడ్డాడన్న ఆతృతలోనూ, మాలిని గురించిన కాగితాల్ని దొరకబుచ్చుకోవాలన్న ఆదుర్దా లోనూ, తన వ్రేలిముద్రలు గాడ్రెజ్ సొరుగులమీద పడతాయన్న ఆలోచనే రానందుకు ఒక్క క్షణం విచా రించాడు.

7

హోటల్లో భోజనంచేసి రూమ్‌కి చేరుకున్నాడు. రాణి గది తాళం వేసి ఉంది. బహుశా ఏ స్టుడియోకో లేక ఆ రోజు గడుపుకునేందుకు ఏ విటుడితోనో వెళ్ళి ఉంటుం దనుకున్నాడు నారాయణరావు.

తన జేబులోంచి తాళాల గుత్తి తీసి, రాణి గది తాళం తీయటానికి యత్నించాడు. ఒకటి రెండు బీగాలు మార్చి చూశాక, తాళం వచ్చింది.

లోపలకు జొరబడి, విడిచేసిన గుడ్డల పెట్టె అడుగున దాచిన కవర్లకోసం చూశాడు. ఆ పెట్టె మూత తీసివుంది. పైపైన ఉన్న గుడ్డలు చిందరవందర చేయబడినై.

ఒకవేళ రాణియే ఏదైనా అండర్‌వేర్‌కోసరం కల బెట్టిందేమో అనుకుంటూ, అందులో చేయిపెట్టి కవర్ల కట్టను బయటకు లాగాడు.

కవర్ల చుట్టూ ఎర్రని రిబ్బన్‌తో కట్టి ముడివేశాడు తను. ఇప్పుడా రిబ్బను వదులుగా వుంది. ఈ కవర్లను రాణిగానీ శోధించిందా?

తను అర్జునరావు ఆఫీసునుంచి ఏడు కవర్లను తెచ్చాడు. మాలిని కవరుని చంద్రశేఖరానికి అప్పజెప్పేశాడు. పోతే ఇంకా ఆరు కవర్లు ఉండాలి! కానీ ప్రస్తుతం అయిదే ఉన్నయ్! ఎవరికీ కనబడకుండా నిగూఢంగా దాచిన

వాటిని ఎవరు తీసిఉంటారబ్బా! రాణి ఈ పని చేసి ఉండదు.

అతడి మనసులో మరో దృశ్యం మెదిలింది. అర్జునరావు కోసం తను పత్రిక ఆఫీసుకు వెళ్ళాడు. హంతకుడు అర్జునరావుని అప్పుడే యమపురికి సాగనంపాడు. ఎవరో రావడం చూసి అతడు లోపలే ఎక్కడో నక్కాడు. తను ఇవేమీ గమనించే పరిస్థితిలో లేడు. రికార్డు రూమ్ లోకి వెళ్ళి తను కొన్ని డాక్యుమెంట్స్‌ని సంగ్రహించాడు. వాటిలోనే హంతకుడికి కావలసిన సమాచారం, అర్జునరావుని నిలువునా హత్య చేసేందుకు ప్రేరేపించిన నిగూఢమైన, అత్యవసర సమాచారం ఉండి వుంటుంది.

మౌనంగా హంతకుడు తనను వెంటాడుతూనే వున్నాడు. తన గదిలో ఇలాంటి అతి ముఖ్యమైన కాగితాల్ని దాస్తాడని ఎవరూ నమ్మలేరు. అందుకే తను రాణి గదిలోకి వెళ్ళి రావటాన్ని గమనించిన హంతకుడు తను చేసిన పనిని కరెక్ట్‌గా ఊహించాడు.

అటు తనూ, ఇటు రాణి లేని సమయంలో వచ్చి, రాణి గదిలోకి జొరబడి, తనకు కావలసిన సమాచారాన్ని ఎత్తుకుపోయాడు. నారాయణరావుకి తల తిరిగిపోయినంత పనయింది. తన వెనుకనే ఇంత గ్రంథం నడుస్తుందని అతడు ఏమాత్రం ఊహించలేకపోయాడు. తన ముంగిట్లోకి వచ్చి, నిర్భయంగా సంచరించిన హంతకుడ్నే తను పట్టుకోలేకపోయాడు. ఇక తన పరిశోధన నిరర్ధకం అనుకున్నాడు.

రాణి గది యధాతథంగా లాక్ చేసి తన గదిలోకి తిరిగి వచ్చాడు నారాయణరావు. ఇప్పటికయినా హంతకుడ్ని త్వరలో వెదికి పట్టుకోకపోతే, తనకు గానీ, లేదా రాణికి

గాని ప్రాణసంకటమే! అయితే హంతకుడి ఆచూకీ కను క్కోనే దెలాగ?

అరగంటసేపు ఆలోచించాక గానీ అతడికి మరొక ఊహ తట్టలేదు. వెండితెరపై సంచరించే సినీతారల చీకటి జీవితాల్ని బట్టబయలు చేసే పక్షపత్రిక 'తెరవెనుక న్యూస్' ఆఖరి సంచికను తిరగేస్తేనో! అందులో తప్పకుండా, ముందుముందు వెలువరించబోయే వార్తల తాలూకు సంగ్రహ ప్రకటనలుంటయ్. ఆ ప్రకటనలవలన నష్టబోయే వారిలోనే తప్పకుండా హంతకుడు ఉండి తీరతాడు.

వెంటనే "తెరవెనుక న్యూస్" పత్రిక ఆఖరు సంచికను బయటకు తీశాడు. తనూహించినట్లే, అందులో సమాచారం దొరికింది. వచ్చే సంచికలో ఏడుగురి తారల తెర మరుగు నికృష్ట జీవితాల్ని వెల్లడించబోతున్నట్టుగా వుంది. మాలిని ఉదంతం గూడ అందులో ఒకటి.

తనవద్ద ఉన్న అయిదు కవర్లూ తెరిచి, అందులోని ఉదంతాల్నంతా చదివాడు. వాటితాలూకు ప్రకటనలు ఆఖరు సంచికలో ఉదహరించబడి వుంది. ఆరోది మాలినికి సంబంధించింది.

వాటిల్లో ఏడవది: గ్లామర్ తగ్గిపోయి, వయసుడిగిపోయిన ఒకానొకప్పటి అందాల హీరోయిన్ రాజామణి అనే ఆమె తన భర్తకు విడాకులిచ్చి, భారత సంప్రదాయానికి విరుద్ధంగా, తనకన్న వయసులో చిన్నవాడైన ఎక్స్ట్రా నటుడ్ని రహస్యంగా పెళ్ళాడిన ఉదంతం ఉంది.

తనవద్ద ఉన్న కవర్లలో తత్సంబంధమయిన వ్యాసం లేదు. అంటే ఆ కవరే తనవద్దనుంచి సంగ్రహించబడిం

దన్నమాట! ఆ మెతాలూకు వ్యక్తే ఈ హత్యను చేసివుంటా డనేందుకు ఏమాత్రం సందేహం లేదు.

హంతకుడి ఆచూకీ దొరికిందన్న సంబరంలో నారాయణరావు కుర్చీలోంచి లేచాడు. హుటాహుటిన దగ్గరలో వున్న స్టుడియోకి చేరుకున్నాడు. రిసెప్షన్‌లో రాజామణి ఇంటి అడ్రసు అడిగి తెలుసుకున్నాడు.

దోవలో పెట్రోల్ బంక్‌లో మోపెడ్స్ బండికి పెట్రోల్ పట్టించి, రాజామణి ఇంటికి బయలుదేరాడు నారాయణరావు.

సిటీ పొలిమేరలో ఉంది రాజామణి బంగళా. చుట్టూ బోలెడంత విస్తీర్ణం, మధ్యలో లంకంత బంగళా ఆమెది.

ద్వారంవద్దకు వెళ్ళి బెల్ పుష్ నొక్కాడు నారాయణరావు. కొద్దిక్షణాల్లో తలుపులు తెరుచుకున్నయ్. తెల్లటి యూనిఫారంలో అప్పుడే స్వర్గంనుంచి దిగిన దేవతలా ఉన్న యువతి వాకిట్లో నిల్చుని వుంది. ఆమె నర్స్ అని తెలుసుకున్నాక, తను రాజామణిని కలుసుకోవాలని వచ్చినట్టు వెల్లడించాడు.

"లాభంలేదు. ఆమె ఆరోగ్యం సరిలేదు. రెండురోజుల్నుంచి 'కోమా'లో ఉందామె!" అంది నర్స్.

"అదేం? పాపం! ఏం జబ్బు ఆమెకు?" నారాయణరావు సానుభూతిని వ్యక్తం చేశాడు.

అంతలో మరో వ్యక్తి రంగంలోకి వచ్చాడు. అతడు ఎర్రగా, పొడుగ్గా ఉన్నాడు. కండలు తిరిగిన దేహంతో ఆడవాళ్ళ మనసుకు హత్తుకుపోయేటంత అందంగానూ ఉన్నాడు.

"మేరీ! ఆ వచ్చినాయన సంగతి నేను చూసుకుంటాను.

నీవు అమ్మగారి దగ్గరకు వెళ్ళు!" అన్నాడా వ్యక్తి నర్స్‌ని ఉద్దేశించి.

నర్స్ లోపలకు వెళ్ళిపోయింది.

"మిస్టర్! ఎందుకొచ్చావ్ ఇక్కడకు?" కోపంగానూ, తన అధికారం ఉట్టిపడే కంఠంతోనూ అతడు అడిగాడు.

"రాజామణిగార్ని చూడాలని వచ్చాను."

"బయట బోర్డు చదవలేదూ? అనుమతి లేనిదే లోనికి రాకూడదు! అని? కనుక మర్యాదగా బయటకు నడు ముందర!"

"అలా అనకండి! మీ క్షేమాన్నాకాంక్షించే వచ్చాను నేను. నా మాట ఆలకిస్తే, మీకు పెద్ద బెడద తప్పు తుంది!"

"ఏమిటా బెడద?" అందాల యువకుడు చిరాగ్గా చూశాడు.

"పోలీసుల బెడద?" నిబ్బరంగా పలికాడు నారాయణ రావు.

ఆ వ్యక్తి బెదురుగా చూశాడు.

"అంటే మీరు పోలీసు ఆఫీసరా?"

"కాదు. ప్రయివేట్ డిటెక్టివ్‌ని!"

"అలాగా! నా పేరు నాగరాజు. రాజామణి నా భార్య!" అంతవరకూ కోపంగానూ, తీవ్రంగానూ కను పించిన వ్యక్తి హఠాత్తుగా మారిపోయాడు. అతడిలో కలిగిన వైఖరిని చూశాక అతడు నిజంగానే ఆరితేరిన నటుడని గ్రహించాడు నారాయణరావు.

"డ్రాయింగ్ రూమ్‌లోకి వెళ్ళి మాట్లాడుకుందాం రండి! మీ పేరేమిటో చెప్పనేలేదు!"

"మిస్టర్ నారాయణరావు!"

"నారాయణగారూ! ఇక మీరు వచ్చిన పనేమిటో చెప్పండి! నా కవతల ఇంకా బోలెడన్ని పనులున్నయ్" నాగరాజు తొందరచేశాడు.

"మీరీ మధ్య పేపర్లో వార్తలు చదువుతున్నారా?"

"నిజానికి నేను పేపరు చూసి నాలుగురోజు లవుతుంది! ఏం జరిగిందట?"

"తెరవెనుక న్యూస్ పక్షపత్రిక ఎడిటర్ అర్జునరావుని ఎవరో హత్యచేశారు."

"అర్జునరావో, కృష్ణమూర్తో నాకెవరూ తెలియదు. కానీ ఆ పత్రిక ఎడిటర్ చేసే వెధవ పనులకి, అతడ్నెవరో తప్పకుండా హత్యచేస్తారని నే నేనాడో ఊహించాను."

"తెరవెనుక న్యూస్ ఆఖరి సంచికలో ఏడుగురి సినీ వ్యక్తుల జీవితాల గురించిన ఉదంతాల్ని బయట పెట్టబోతున్నట్టుగా ప్రకటన వెలువడింది. ఆ ఏడుగురిలో నే ఎవరో ఒకరు ఈ హత్యను చేసివుండాలని నా అనుమానం!" నారాయణరావు అవతల వ్యక్తి ముఖభంగిమల్ని గమనిస్తున్నాడు.

"ఆ ఏడుగుర్నీ వరుసగా ఇంటర్వ్యూ చేస్తున్నాం. హంతకుడి ఆచూకీకోసం రాజామణిగార్ని కలుసుకోవాలి నేను!" మళ్ళీ అన్నాడు నారాయణరావు.

"అది వీలుపడదిప్పుడు. ఎందుకనంటే ప్రస్తుతం రాజామణి తీవ్రమైన జబ్బుతో వుంది. మనిషిగూడ స్పృహలో లేదు. డాక్టర్ గురవారావుగూడ ఆమెను కనిబెట్టుకునే వున్నారు. కావాలంటే ఆయనతో మాట్లాడి, నే చెప్పిన విషయం నిజమో, అబద్ధమో తేల్చుకోండి!" నాగరాజు గబగబ పాఠం చదివినట్టుగా చెప్పుకుపోతున్నాడు.

"సరే! మీరు చెప్పిన విషయమే ఒప్పుకుంటాను. రాజామణి రెండురోజుల్నుంచీ స్పృహలో లేదనే అనుకుందాం! అర్జునరావు హత్యచేయబడిన సాయంకాలం మీరెక్కడున్నారు?" నారాయణరావు అనుమానంగా చూశాడు.

"ఇది మరీ బాగుంది! ఉరుము ఉరిమి ఉరిమి మంగలం మీద బడిందట! అర్జునరావును చంపాల్సిన అవసరం నాకేముంది. అయినా, ఆరోజు నేనొక మిత్రుడితో సినిమాకు వెళ్ళాను!"

"ఎవరా మిత్రుడు?"

"అతడీ ఊళ్ళోలేడు ప్రస్తుతం! మీరు నన్ను అనవసరంగా అనుమానిస్తున్నారు!"

"లేదు. మిమ్మల్ని ప్రశ్నించటానికి నాకు సరైన కారణం వుంది. రాజామణికి సంబంధించిన కవరు అర్జునరావు ఆఫీసునుంచి మాయమయింది! ఆ పనిని రాజామణి చేసి వుందనటానికి ఆమెకు అవకాశంలేదు, ఎందుకనంటే ఆమె గత కొద్దిరోజులుగా 'కోమా' లో ఉంది గనుక. ఇకపోతే అలాంటి అవకాశం, అవసరమూ మీకు తప్ప మరెవరికీ లేదు!"

"ఇదంతా మీ అభూతకల్పన! మీరు చెప్పేదే నిజమై వుంటే, నాకోసం పోలీసులు రాలేదేం?" తనే తెలివి గలవాడిలా ప్రశ్నించాడు నాగరాజు.

"వాళ్ళకింకా ఈ విషయం తెలియదు!"

"అర్జునరావే దాన్ని మరెక్కడైనా దాచాడేమో! ఏది ఏమైనా రాజామణికి సంబంధించిన ఉదంతం బయటకు రాదు ఇక! అంతవరకూ మేం అదృష్టవంతులం!" నాగరాజు కళ్ళు ఆనందంతో మెరిసినయ్.

"తన గురించిన ఉదంతం 'తెరవెనుక న్యూస్' పత్రికలో పడుతున్నదన్న విషయం రాజామణిలో యెలాంటి ఉద్రిక్తతనూ రేపలేదా?"

"ఆమెకు చాలా కోపం వచ్చింది. ఆ పత్రిక ఎడిటర్ పై పరువునష్టం దావా వేస్తానంది. కానీ ఈ లోపలే ఆమెకు అనారోగ్యం కలిగింది. అయినా ఆమె దావా నెగ్గదనుకుంటాను. ఎందుకంటే అలాంటి పత్రికల్లో ప్రచురింపబడే వార్తలకు తగిన సాక్ష్యాధారాలు లేకుండా వేయరు. లేకపోతే, ఈ నాటికి సినీఫీల్డులో వారంతా దావా వేసి, అర్జునరావుని జైలుకి పంపివుండేవారే కదా?" నాగరాజు నిదానంగా, ఎలాంటి ఉద్వేగమూ లేకుండా చెప్పాడు.

8

"హల్లో మిస్టర్ డిటెక్టివ్! నీకోసం రెండుసార్లు ఫోన్ చేశాను. దొరకలేదు, మీకో శుభవార్త చెబుదామంటే!" పోలీస్ ఇన్‌స్పెక్టర్ నవ్వాడు నారాయణరావు వంక చూసి.

"ఏమిటి సార్ ఆ వార్త?"

"మీ ప్రథమ క్లయింట్ చంద్రశేఖరాన్ని హత్యా నేరంపై అరెస్టు చేశాం. బెయిల్ గూడ నిరాకరించబడి, మా ఆతిథ్యంలో వున్నాడు. మీ కోసం పాపం తెగ కలవరిస్తున్నాడు."

ఇన్‌స్పెక్టర్ మాటలు విని నారాయణరావు విభ్రాంతుడయ్యాడు. తనిచ్చిన సమాచారాన్ని ఆధారం చేసుకుని పోలీసులు చంద్రశేఖరాన్ని అనుమానించారన్నమాట! తీసుకొచ్చి కటకటాల వెనుక పెట్టారన్నమాట! తన

మొదటి క్లయింట్ ఈ రకమైన దుస్థితికి దిగజారటం అతడికి నచ్చలేదు.

నారాయణరావు జైలు గదిని సమీపించాడు.

కటకటాల అవతల దీనంగా చూస్తూ నిలబడివున్నాడు చంద్రశేఖరం. నారాయణరావుని చూడంగానే అతడికి ప్రాణం లేచివచ్చింది.

"ఏం డిటెక్టివయ్యా నువ్వు! నీకేదో పని పురమాయిస్తే నన్నే హంతకుడి క్రింద అరెస్టు చేయిస్తావా?" చంద్రశేఖరం ఆవేశంగా అన్నాడు.

"ఆవేశపడకండి! మీరీ హత్య చెయ్యలేదనే నేనూ నమ్ముతున్నాను. ఐనా మిమ్మల్నీ ఎలా అనుమానించారో నా కర్థం కావటంలేదు."

ఈ హత్యను చంద్రశేఖరమే చేసి తనపై అనుమానం రాకుండా కాపాడుకునేందుకే డిటెక్టివ్‌ని నియమించటం జరిగింది, ఈ కారణాలవల్లనే చంద్రశేఖరం అనే సినీ దర్శక నిర్మాతను అనుమానంపై అరెస్టు చేయటమైనది— అది పోలీసుల అనుమానం.

చంద్రశేఖరం తనపై తేబడిన అభియోగాన్ని నారాయణరావుకి వినిపించాడు.

"నేనీ హత్య చేయలేదు. ఎలాగైనా నన్నిక్కడ్నుంచి బయటకు లాగండి నారాయణరావ్ గారూ!"

"అదే ఆలోచిస్తున్నాను. అర్జునరావును హత్యచేసిన వ్యక్తికోసం గాలిస్తున్నాను. త్వరలో అతడ్ని దొరకబుచ్చుకోగలననే నమ్ముతున్నాను. మీరు నిశ్చింతగా ఉండండి" అని ధైర్యం చెప్పి అక్కడినుండి కదిలాడు నారాయణరావు.

9

తన రూమ్ కి తిప్పుతూ రాణి గదివేపు చూశాడు నారాయణరావు.

రాణి గది తలుపు వారగా వేసి ఉంది. అదే నారాయణ రావుకు ఆశ్చర్యాన్ని కలిగించింది. రాణి బయటకు వెడితే, తలుపుబయట తాళం వేస్తుంది. గదిలో ఎవరన్నా ప్రియు డితో సుఖిస్తుంటే, తలుపుమూసి లోపల గడియపెడు తుంది.

అందుకే ఆమె గది తలుపు వారగా వేసి ఉండటం నారాయణరావులో అనుమానాన్ని రేకెత్తించింది. తన గది తలుపు తెరవకుండానే, చప్పుడు చేయకుండా రాణి గదివద్దకు వెళ్ళాడు. తలుపుమీద చేయివేసి నెట్టాడు. తలుపు పూర్తిగా తెరుచుకుంది. నారాయణరావు శరీరం మీద రోమాలు నిక్కబొడుచుకున్నయ్.

"రాణి!" అని పిలుస్తూ లోపలకు ప్రవేశించాడు. గదిలో డిమ్ లైటు వెలుగుతోంది. ఆతృతగా ముందుకు నడిచాడు. గది అంతా చిందరవందరగా ఉంది. నేలమీద రాణి గుడ్డలూ, పుస్తకాలు ఇష్టమొచ్చినట్టుగా పడి ఉన్నయ్. కొద్ది క్షణాల క్రితమే ఎవరో ఆ గదిలోని ప్రతి అరా, ప్రతి షెల్ఫునీ, ప్రతి సూట్ కేస్ నూ దేనికోసమో వెదికి నట్లుగా స్పష్టంగా తెలుస్తోంది, ఆ చిందర వందర చూస్తుంటే!

స్విచ్ బోర్డ్ దగ్గరకు వెళ్ళి లైటు వెలిగించాడు నారాయణరావు. అడుగు ముందుకు వేయబోయిన వాడల్లా, బెదిరిన గుర్రంలా వెనక్కు గెంతాడు.

బెడ్ కి ప్రక్కనే నేలమీద నగ్నంగా పడిఉంది రాణి. ఆమె ఒంటిమీద ఎక్కడా గాయాల్లేవు. సిల్కులాగున్న

ఆమె నల్లని కురులు ముఖంమీద పరదాలాగ కప్పబడినై.

బెడ్ మీద దుప్పటిలాగి ఆమె వక్షంవరకూ కప్పాడు.

ఆమె మరణానికి ఒక రకంగా తనకూ బాధ్యత ఉందేమో! 'తెరవెనుక న్యూస్' పత్రిక ఆఫీసునుంచి తను తెచ్చిన కవర్లను రాణి గదిలో దాచటంవల్లనే, అర్జున రావుని హత్యచేసిన హంతకుడు, రాణిని వెతుక్కుంటూ వచ్చాడు. సాధారణ విటుడిలా ఆమెను బుక్ చేసుకుని, ఎవరికీ అనుమానం కలగకుండా ఆమెను హత్యచేశాడు, ఆమె నుంచి సుఖాన్ని జుర్రుకున్న తర్వాత.

ఇంతకీ అతడికి కావల్సింది దొరికిందో లేదో? రెండు హత్యలు చేయటానికి వెనుకాడని హంతకుడు తననుగూడా వెతుక్కుంటూ రాడని నమ్మకం ఏమిటి?

పోలీసులకు ఫోన్ చేయటానికి వెనక్కు తిరిగాడు నారాయణరావు.

వెనుకవైపునుంచి ఎవరో అతడి తలపై బాదారు. నారాయణరావుకి కళ్ళు బైర్లు కమ్మాయి. కళ్ళు తెరచి ఆ ఆగంతకుడ్ని చూడటానికి యత్నించాడు.

"మరోటివ్వరా! వాడికి తెలివివస్తోన్నట్టుంది!" ఎవరిదో కర్కశమైన కంఠం వినిపించింది.

అంతలోనే మరో దెబ్బ పడింది. నారాయణరావు నేలకు జారిగిల పడ్డాడు. అతడు పూర్తిగా పడిపోకుండా, ఒక వ్యక్తి, అతడి వెనుకగా చంకల క్రిందనుంచి చేతులు వేసి గట్టిగా పట్టుకున్నాడు.

నారాయణరావుకి ఎదురుగా ఒక వ్యక్తి వచ్చాడు. అతడి చేతిలో నల్లని పిస్తోలు మెరుస్తోంది. ఆ వ్యక్తి ముఖ కవళికల్ని గుర్తుపెట్టుకోవటానికి యత్నించాడు. ఆ వ్యక్తి లావుగా ఉన్నాడు. బండ ముఖం, కోర మీసాలు, త్రాగి

నందువల్ల ఎఱ్ఱబారిని కళ్ళూ, అచ్చం రోడ్లమీద తిరిగే రౌడీ లాగున్నాడు. పాతికా పరకిక్కూడా అవలీలగా హత్యచేసే వాడిలా ఉన్నాడు.

“ఏమయ్యోవ్! పెద్దమడిసే! మేం సెప్పేది జాగ్రత్తగా విను! సినిమా పత్రిక ఆఫీసులోంచి కవర్లు దొంగిలించు కొచ్చావంట నీవు! వాటికోసమని పాపం ఆ యమ్మాయి ప్రాణాల్ని తోడేశాం. పాపం ఠకీమని చచ్చూరుకుంది. కానీ ఆ కాయితాలే కనుపించలేదు. ఒకవేళ అవి నీదగ్గర గానీ ఉంటే, వాటిని శాశ్వతంగా పూడ్చెయ్. లేదా నిన్ను బ్రతికుండగానే సజీవ సమాధి చేస్తాం. తెలిసిందా?”

“చాల్లే ఇక! మనం చెప్పాల్సింది చెప్పాం! ఇక వాడ్ని కాసేపు జోకొడదాం!” ఇద్దరూ కలిసి నారాయణరావు మీద గుద్దులవర్షం కురిపించారు. నారాయణరావుకి స్పృహ తప్పిపోయింది. నేలమీది జారిగిలబడ్డాడు. కళ్ళముందు నల్లని తెరలు జారినయ్.

10

మరో గంటలో ఆ గది అంతా పోలీసులతో నిండి పోయింది.

నారాయణరావుని అపస్మారక స్థితిలో వదిలేసి వెళ్ళి పోయారు గుండాలు. తెలివిరాగానే, తూలుకుంటూ నడిచి టెలిఫోన్ బూత్‌లోకి వెళ్ళాడు నారాయణరావు. పోలీస్ స్టేషన్‌కి ఫోన్ చేశాడు.

ఇన్స్పెక్టర్ రాజు వచ్చాడు క్షణాలమీద. అంబులెన్సూ, పోలీస్ ఫొటోగ్రాఫర్లూ, డాక్టరూ, కానిస్టేబుల్స్ రాకతో ఆ ఫ్లాట్ అంతా మేలుకుంది. రాణి దేహాన్ని మార్చురీకి తరలించారు.

నారాయణరావుని అనేక ప్రశ్నలడిగారు. చివరకు రాణి హత్యను, ఉద్రిక్తుడైన ఆమె ప్రియుడెవరన్నా, రాణి మరెవరితోనో గడపడం చూసి సహించలేక ఈ హత్య చేసి ఉండాలని నిర్ధారించారు పోలీసులు. అర్జునరావు హత్యకూ, రాణి హత్యకూ ఏమాత్రం సంబంధాన్ని వాళ్ళు అంగీకరించలేదు.

ఆ ఫ్లాట్ యజమాని వచ్చాడు. రాణి ప్రవర్తనగురించీ, ఆమెకోసం వచ్చే ప్రియుల గురించీ చెప్పాడు పోలీసులకు. ఎంతో నిగూఢంగా, చాటు మాటుగా, తమ కోర్కెలను తీర్చుకుంటూ పోతున్న పెద్దమనుషులందరూ, రాణి హత్య మూలంగా, బజారుకీడ్వబడ్డారు. అందరూ ప్రశ్నించబడ్డారు. కానీ అనుమానితులెవరూ లేనందున, ఎవరూ అరెస్టు చేయబడలేదు.

నారాయణరావు తనవద్దనున్న మిగతా కవర్లను విప్పదీసి చదవక తప్పలేదు. అవన్నీ గూడ 'తెరవెనుక న్యూస్' తరువాయి సంచికల్లో ప్రచురణకుద్దేశింపబడినవే! అయితే అర్జునరావు హఠాన్మరణంతో అవి ప్రెస్‌లోకి వెళ్ళలేక పోయినయ్.

మిగతా కవర్లలో సైడ్ హీరోయిన్ల పడకటింటి ముచ్చట్లూ, క్లబ్ డాన్స్ చేసే తారల విపరీత కోర్కెలూ ముచ్చటించబడినై.

వాళ్ళ అడ్రసు ఒక్కొక్కటే వెతుక్కుంటూ వెళ్లాడు నారాయణరావు.

"మీ గురించి విపరీత వ్యాఖ్యానాలు ప్రచురించబోతుంటే మీకు కోపం రాలేదా ఆ పత్రికమీద?" అనడిగాడు ఒక తారామణిని.

"ఆమె నవ్వింది. ప్రత్యక్షంగా గానీ, పరోక్షంగా గానీ మాకు పబ్లిసిటీ ఉంటేనే మేం సినీఫీల్డ్‌లో నిలద్రొక్కుకోగలం. ప్రముఖ సినిమా పత్రికల్లో మాముఖాల్ని ఎక్కడో మారుమూల వేస్తారు. అందుకే తెరవెనుక న్యూస్‌లోకి ఎక్కితే, సెక్సీస్టార్‌గా మాకు మాంఛి పబ్లిసిటీ వస్తుంది కానీ ఖర్చులేకుండా! ఆ కారణంగానే ఆ పత్రిక ఎడిటర్ ఆ వ్యాసాన్ని ప్రచురించకుండా ఉండేందుకు డబ్బడిగితే, నేను నిరాకరించటమేగాక తిట్టిపంపించాను.ఆ కోపంతో అతడు నా గురించిన మేటర్‌ని తప్పకుండా ప్రచురిస్తాడు. మాకు కావలసిందీ అదేగా!" అని వాస్తవాన్ని, దాపరికం లేకుండా చెప్పింది ఆమె.

మిగతా తారల్ని గూడ ఇంటర్వ్యూ చేసి తిరుగుముఖం పట్టాడు నారాయణరావు. కాని అతడికి అనుమానించదగ్గ సమాచారం ఏదీ దొరకలేదు.

వెళ్ళే దోవలో రాజామణి బంగళా ముందు ఆగాడు అతడు. తను లోగడ వచ్చినప్పుడు రాజామణి అస్వస్థతగా ఉంది. ఇప్పుడామె కెలా ఉందో తెలుసుకుందామని లోపలకు నడిచాడు నారాయణరావు.

రాజామణి పోర్టికోలో పేము కుర్చీలో తలగడలమీద కూర్చొని ఉంది. నాగరాజు ఆమె కెదురుగా కూర్చుని ఏవో కబుర్లు చెబుతున్నాడు.

"నమస్కారం! ఇప్పుడు రాజామణిగారి ఆరోగ్యం ఎలా వుంది?" అని వాకబు చేశాడు నారాయణరావు.

"కులాసాగానే వుంది. కానీ మీ చొప్పదంటు ప్రశ్నలకు సమాధానమిచ్చే ఓపిక లేదు ఆమెకు. దయచేసి వెళ్ళిపొండి!" నాగరాజు మాటకు అడ్డువచ్చాడు.

"ఎందుకలా కంగారు పడతావ్! నేనేప్రశ్నలు వేయడానికి రాలేదు. కేవలం రాజామణిగార్ని చూడటానికి వచ్చాను. అంతే!"

"కూర్చోండి!" అంది రాజామణి, అతడివంక చూస్తూ.

"ఎలా వుంది మీ ఆరోగ్యం?"

"ఇప్పుడు కొంచెం నిదానించింది. అన్నట్టు మీ రెవరు?" అంది రాజామణి.

"నా పేరు నారాయణరావ్! ప్రైవేట్ డిటెక్టివ్ ని! మిలట్రీనుండి రిటైర్ అయ్యాను. 'తెరవెనుక న్యూస్' పత్రిక ఎడిటర్ అర్జునరావు హత్యచేయబడ్డాడు.ఆ కేసులో హంతకుడి ఆచూకీకోసం యత్నిస్తున్నాను."

రాజామణి ఆశ్చర్యాన్ని వెలిబుచ్చింది. "ఏమిటీ? రావు హత్యచేయబడ్డాడా? ఎవరా పుణ్యం కట్టుకుంది?"

"అర్జునరావు గురించి మీ అభిప్రాయం ఏమిటి?"

"అతడు నా గురించి తన పత్రికలో ఏవో అవాకులు చవాకులు, వేస్తానని బెదిరించాడు. నేను లెక్క చేయలేదు. ఆ తర్వాతేమయిందో తెలీదునాకు, నా అనారోగ్యం మూలంగా. నా గురించి ఆ పత్రికలో ఏదీ ప్రచురింపబడలేదని చెప్పాడు నాగరాజు. కానీ అర్జునరావు మరణం గురించి చెప్పలేదు." అంటూ రాజామణి, నాగరాజు వంక చూసింది.

"నీవు బలహీనంగా ఉన్నావ్! అందుకే ఈ దుర్వార్త చెప్పలేదు." వెంటనే అన్నాడు నాగరాజు.

"అర్జునరావు మరణవార్త నాలో సగం బలాన్ని కలిగించింది. అసలతడు బ్రతికే వున్నా, అతడిమీద ఈ పాటికి పరువునష్టం దావా వేసేదాన్ని!"

నాగరాజుకి ఈ సంభాషణ రుచించినట్టు లేదు, లేచి ఇంట్లోకి వెళ్ళిపోయాడు. రాజామణితో ఏకాంతంగా మాట్లాడేందుకు నారాయణరావుకి వీలు చిక్కింది.

"మిమ్మల్ని మరొక్క ప్రశ్న అడగక తప్పటంలేదు. అవతల ఒక నిరపరాధిని జైల్లోకి తోసేశారు. అతడి తరఫున నేను హంతకుడికోసం యత్నిస్తున్నాను."

"దాందేముంది! అడగండి! నా సహకారం మీకు తప్ప కుండా వుంటుంది!" రాజామణి అనుమతినిస్తూ అంది.

"మీ గురించి 'తెరవెనుక న్యూస్' ప్రచురిస్తానన్న ఉదంతం దేనికి సంబంధించిందో? ఆ వార్త వివరాలు క్లుప్తంగా ఇవ్వగలరా? మీ వ్యక్తిగత విషయాల్లో క్షోభ్యం కలిగించుకోవలసిరావటం నాకూ బాధగానే వుంది. కానీ ఒక నిరపరాధిని విడుదలచేయించే ప్రయత్నంలో ఆప్రశ్న అడగక తప్పలేదు" నారాయణరావు వేడికోలుగా అడిగాడు.

రాజామణి లోపలకు తొంగిచూసింది, దాపుల్లో నాగరాజు వున్నాడేమో అని. అతడక్కడ లేడని నిర్ధారణ చేసుకుని మెల్లగా అంది.

"నేను హీరోయిన్‌గా వున్నప్పుడు, కృష్ణ అనే దర్శకుడితో సాన్నిహిత్యం ఏర్పడింది. తర్వాత నేను వెండితెర మీది నుంచి విరమించుకున్నా, అతడు నా స్నేహాన్ని మరువలేదు. అప్పుడప్పుడు నాకోసం వచ్చేవాడు. ఇద్దరం "నవయుగ" హోటల్‌కి వెళ్ళి, ఒకటి రెండురోజులు గడిపి తర్వాత విడిపోయేవాళ్ళం! మా ఈ రహస్య కలయికను ఎలా పసిగట్టాడో పసిగట్టాడు అర్జునరావు. పెద్ద మొత్తంలో పత్రికకు డొనేషన్ ఇస్తావా, లేక మీ రహస్య ప్రయాణాన్ని బయటపెట్టనా అని బెదిరించాడు.

'చిల్లి గవ్వ ఇవ్వను, నీకు చేతనైంది చేసుకో' అని వాడ్ని తరిమేశాను. ఆ తర్వాత రెండురోజులకు నేను నాగ రాజుని వివాహమాడటం తటస్థించింది.''

''మీ అమూల్య సమాచారానికి నా ధన్యవాదాలు. ఇప్పటికే మీకు చాలా శ్రమ ఇచ్చాననుకుంటాను.వస్తాను!'' అంటూ నారాయణరావు కుర్చీలోంచి లేచాడు.

11

స్కూటర్ మీద స్పీడుగా పోతున్నాడు నారాయణ రావు.

దోవలో పోలీస్ స్టేషన్ తగిలినా, అక్కడ ఆగలేదు, అతడు!ఇన్‌స్పెక్టర్ రాజు,నారాయణరావు అంత వేగంగా ఎక్కడికి వెడుతున్నాడా అని ఒక్క క్షణం ఆశ్చర్య పోయాడు.

స్కూటర్ మలుపు తిరిగింది.అప్పుడే రాజామణికారులో ఎక్కడికో వెళ్తోంది.

నాగరాజుతో తను ఏకాంతంగా మాట్లాడేందుకు ఇది మరీ అనువైన సమయం అనుకుంటూ లోపలకు నడిచాడు నారాయణరావు.

బెల్ పుష్ నొక్కాడు.తలుపు తెరుచుకుంది. ద్వారంలో నాగరాజు నిలబడి వున్నాడు.నారాయణరావుని చూస్తూనే అతడి కోపం మిన్నుముట్టింది. మరో మాటా పలుకూ లేకుండా తలుపు వేయబోయాడు.

నారాయణరావు తలుపుల్ని బలంగా నెట్టాడు. ఆ ఊపుకి నాగరాజు వెనక్కు తూలి పడబోయాడు. ఎలాగో నిలదొక్కుకున్నాడు.

''ఏమిటీ దౌర్జన్యం నా ఇంట్లోనే నామీద! మర్యాదగా బయటకు పోతావా? లేక పోలీసుల్ని పిలవమంటావా?''

"పోలీసుల్ని పిలుస్తావేం? పిలు! నా పని ఇంకా తేలికే అవుతుందిగూడా!" అన్నాడు నారాయణరావు లోపలికి అడుగేస్తూ.

"ఎందుకు నన్నిలా వెంటాడి వేధిస్తావ్! ఈ హత్య విషయంలో చంద్రశేఖరం ఇస్తానన్న దానికి రెట్టింపు నే నిస్తాను. నా జోలికి రాకుండా వెళ్ళిపో! నీకు దణ్ణం పెడతాను." నాగరాజు రాజీబేరానికి దిగాడు.

"ఓహో అంతదాకా వచ్చిందా? అయితే రెండు వేలు ఇయ్యి! పోతాను." నారాయణరావు మెత్తబడ్డట్టుగా నటించాడు.

నాగరాజు ఒక్క అంగలో లోపలికి వెళ్ళాడు. చెక్ బుక్ తెచ్చి రెండువేలకు చెక్కురాసి నారాయణరావు చేతిలో పెట్టాడు.

"మంచివాడ్ని వెయ్యిరూపాలిచ్చి కొనుక్కోమన్నారు చెడ్డవాడ్ని రెట్టింపయినా ఇచ్చి వదిలించుకోమన్నారు పెద్దలు!"

ఇద్దరూ ఒకరి ముఖంలోకి మరొకరు చూస్తూండి పోయారు, గోదాలో కుస్తీపట్టబోయే ప్రత్యర్థుల్లాగ.

"ఇక వెళ్ళు!" అసహనంగా అన్నాడు నాగరాజు.

"ఒక్కమాట! ఈ హత్యను ఎందుకు చేశావో చెప్తేగానీ వెళ్ళను. దీన్ని మరెవరికీ చెప్పను. హత్య జరిగిన తీరుని కనుక్కోగలిగానన్న ఆత్మసంతృప్తికోసం మాత్రమే అడుగుతున్నాను."

నాగరాజు కళ్ళలో ద్వేషం కనుపించింది. అతడిచేయి జేబులోకి వెళ్ళింది. రివాల్వర్ని బయటకు తీసి, నారాయణరావుకి గురిపెట్టాడు.

"నాకు తెలుసు! నీవు మంచిగా వెళ్ళవని!"

"పోనీ నీ నోటిగుండా వెల్లడించటానికి ఇష్టంలేకపోతే నేనే చెబుతాను. అవునో, కాదో నీవు సరిచెయ్యి." అన్నాడు నారాయణరావు చలించకుండా.

"నీకు రాణి అనే స్నేహితురాలుండేది. నీవూ ఆమె కలిసి పేరులోవున్న హీరోయిన్లను విచిత్ర శృంగారం లోకి దించేవాళ్ళు. ఆ సమాచారాన్ని 'తెరవెనుక న్యూస్' పత్రికకు అమ్మి డబ్బుచేసుకునేవాళ్ళు. రాజామణికూడ తన పాతప్రియుడైన దర్శకుడు కృష్ణని కలుసుకోవడం కోసం నవయుగ హోటల్ కి వస్తూండేది. ఆ సమాచారాన్ని నీవు సేకరించి 'తెరవెనుక న్యూస్'కి లిఖిత పూర్వకంగా అఫిడవిట్ పై నీవు సంతకం చేసియిచ్చావు. అందుకు ముట్టిన ప్రతిఫలంతో నీ రోజులు గడుపుతున్నావ్.

అంతలో నూతన పరిణామాలు సంభవించాయి. కారు ఏక్సిడెంట్ లో కృష్ణ మరణించాడు. రాజామణి గర్భవతి అయింది. అందుకే ఆమె నిన్ను చేరదీసి వివాహమాడింది. తెరవెనుక న్యూస్ లో ఆమె గురించిన ప్రణయగాథ ప్రచురించబోతున్నాడని తెలిసేసరికి నీ గొంతులో పచ్చి వెలక్కాయ పడ్డటయింది. ఈ విషయం రాజామణి తెలుసుకోకుండా వుండాలని ఆమెకు మత్తుమందిచ్చి అస్వస్థురాల్నిగా చేశావ్!

"ఆ ప్రచురణను చూస్తే రాజామణి తప్పకుండా ఆ ఎడిటర్ పై పరువునష్టం దావా తెస్తుంది. అర్జునరావు సమాధానం క్రింద నీవు లిఖితపూర్వకంగా, నీ సంతకంతో ఇచ్చిన అఫిడవిట్ ని కోర్టులో దాఖలుచేసి తీరతాడు. తన పరువుని రచ్చకీడ్చింది నీవే అని తెలిస్తే రాజామణి నిన్నేం చేస్తుందో నీకు తెలుసు. ఆమె డబ్బుతో విలాసాల్లో మునిగి తేలుతున్న నీవు, తిరిగి

బజార్లలో ముష్టెత్తుకోవాల్సి వస్తుందో, లేక జైల్లో యావ జ్జీవితం సాంబారు కూడే తినాల్సి వస్తుందోనని భయపడ్డావు.

"అందుకే నీవు బాగా ఆలోచించి, అర్జునరావుని హత్యచేశావ్! నీ భార్య పాత ప్రణయాలు ప్రెస్‌లోకి రాకుండా జాగ్రత్తపడ్డావ్! కానీ రాణిని ఎందుకు హత్య చేశావో అర్థం కాలేదు నాకు!" నారాయణరావు నిదానంగా తనకు తెలిసిన, ఊహించిన కథనంతా వెల్లడించాడు.

12

నాగరాజు భయంగా నోరెళ్ళబెట్టి వింటున్నాడు. అతడి పెదవులు వణకుతున్నయ్. రివాల్వర్ పట్టుకున్న చేయికూడా వణకుతోంది.

"ఎక్కడ అల్లుకొచ్చావ్ ఈ కథనంతా!" చివరకు నోరు పెగల్చుకుని అడిగాడు నాగరాజు. "కానీ ఇదంతా నీవు చస్తే బుజువు చేయలేవు!"

"ఇదే రివాల్వర్‌తో కదూ అర్జునరావుని కాల్చింది?"

"అదే రివాల్వర్‌తో నిన్నూ ఈ పాటికి కాల్చనందుకు సంతోషించు."

"రాణిని ఎందుకు చంపిందీ ఆ ఒక్కటీ చెప్పు?"

"అదీ నేనే చేశాననే నీ అనుమానమా?"

"అనుమానమేం లేదు. నిస్సందేహంగా నీవే చేశావని నా అభిప్రాయం!" ఈ మాటతో నాగరాజు చేతిలోని రివాల్వర్ ప్రేలుతుందనే భయపడ్డాడు నారాయణరావు. కానీ అందుకు భిన్నంగా జరిగింది.

తన ప్రతాపాన్ని పొగుడ్తూన్నట్టుగా తోచింది నాగరాజుకు. అతడి కళ్ళు గర్వంగా మెరిసినయ్.

"ఆమెను చంపటం నా ఉద్దేశ్యం కానే కాదు! ఆమె దగ్గర రాజామణికి సంబంధించిన కాగితాలుగానీ, నేను వ్రాసిచ్చిన అఫిడవిట్ గానీ, ఉంటే తెమ్మని పంపాను. కానీ ఆ గూండాలు అనవసరంగా ఆమె ప్రాణాల్ని తోడేశారు."

"ఆ కాగితాలు ఆమె గదిలో ఉన్నట్టు నీకెలా తెలుసు?"

"అర్జునరావ్ ని చంపాక, నీవు రావటం చూసి, నేను లోపలే దాక్కున్నాను. నీవు అల్మరాల్లోంచి కవర్లు తీసుకు పోవటం చూశాను. వాటిలో రాజామణి సమాచారం గూడ ఉండచ్చని భ్రమపడ్డాను. దాన్నెలాగైనా సంగ్రహించాలని నీకు తెలియకుండా వెంబడించాను.

నీవు చేతిలో సంచీతో రాణిగదిలో కెళ్ళటం చూశాను. తిరిగి ఒట్టిచేతులతో బయటకు తిరిగివచ్చావ్! కనుక వాటిని రాణి గదిలో దాచావని గ్రహించాను."

"ఆ ఇద్దరు గూండాలు రాణిని చంపారు! నన్ను చితక బాదారు. వాళ్ళను నీవే పంపావన్నమాట!"

"అవును! నా గురించిగానీ, నా భార్య రాజామణి గురించిగానీ 'తెరవెనుక న్యూస్' ఆఫీసులోగానీ, నీ దగ్గర గానీ మరే సమాచారం లేదు. ఇక నన్ను బ్రహ్మదేవుడు గూడ పట్టలేడు." నాగరాజు సంతోషంతో నవ్వాడు. అతడి కళ్ళవెంట నీళ్ళు వచ్చేదాకా నవ్వాడు.

"నీ సమాచారానికి చాలా కృతజ్ఞుణ్ని నాగరాజూ! మనిద్దరి సంభాషణా శుభ్రంగా టేప్ రికార్డ్ చేయబడింది, నా జేబులోని మినీ టేప్ రికార్డర్ ద్వారా!" నారాయణ రావు చిరునవ్వుతో అతడి ముఖంలోకి చూశాడు.

ప్రక్కలో బాంబు పడ్డట్టుగా అదిరిపడ్డాడు నాగరాజు.

"అయితే నీవు ప్రాణాలతో ఇక్కడ్నుంచి బయటకు పోలేవు!" నాగరాజు పిచ్చిగా అరిచాడు, చేతిలోని రివాల్వర్ ని లెవెల్ చేస్తూ.

నారాయణరావు ఊహించనంత వేగంగా యెగిరి తన్నాడు నాగరాజును. ఆ మిలట్రీ దెబ్బకు నేలకు కరుచుకున్నాడు నాగరాజు. రివాల్వర్ ఎగిరి దూరంగా పడింది.

బిలబిలమంటూ పోలీసులు లోపలకు జొరబడ్డారు.

"సమయానికి వచ్చారు ఇన్ స్పెక్టర్! ఐనా నేనిక్కడున్నట్టుగా ఎలా కనుక్కోగలిగారు?" నారాయణరావు ఆశ్చర్యంగా చూస్తూ అడిగాడు.

"మా స్టేషన్ ముందునుంచే నీవు స్పీడ్ గా పోతున్నావ్! నిన్ను అంత వేగంగా రప్పించే న్యూస్ ఏమిటో తెలుసుకోవాలన్న కుతూహలంకొద్దీ నిన్ను వెంబడించాం. కిటికీదగ్గర పొంచివుండి మీ సంభాషణ అంతా విన్నాం! మొత్తానికి హంతకుడ్ని వెదికి పట్టుకుని, నీ మొదటి కేసుని విజయవంతం చేసుకున్నావ్ మిస్టర్ నారాయణరావ్!"

"థాంక్యూ ఇన్స్పెక్టర్!" అంటూ జేబులోని టేప్ రికార్డర్ తీసి ఇన్ స్పెక్టర్ కు అందించాడు.

ముందుకు జాపిన నాగరాజు చేతులకు బేడీలు పడినయ్.

"నీ నాటకం చరమాంకానికి వచ్చింది మిస్టర్ నాగరాజూ! ఇక తెరదింపటమే మా వంతు!" అంటూ నాగరాజుని వ్యాన్ లో ఎక్కించాడు ఇన్ స్పెక్టర్ రాజు.

—:ఐపోయింది:—